# పేదలకు దసరా కానుక

- వేమగిరి 2 లేఅవుట్‌లో చదును పనులు పూర్తి
- వారం రోజుల్లో ప్లాట్ల కేటాయింపు
- 850 మందికి చేకూరనున్న లబ్ధి

**కడియం:** మండల పరిధిలోని వేమగిరి2 జగనన్న లేఅవుట్‌లో స్థలం చదును పనులు దాదాపు పూర్తయ్యాయి. వారం రోజుల్లో వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ కృషితో ఈ సమస్య పరిష్కారమైంది. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**వివరాలు ఇవీ..**

మండలం పరిధిలోని జేగురుపాడు, వేమగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలో సుమారు మూడు వేల మందికి ప్లాట్లు కేటాయించారు. అందులో 70 శాతం మందికి పైగా ఇళ్లు కూడా నిర్మించుకున్నారు. అయితే వేమగిరి 2 లేఅవుట్‌కు సంబంధించి జిల్లా పరిషత్ స్థలాన్ని సక్రమంగా చదును చేయకపోవడంతో ప్లాట్ల కేటాయింపు పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో దాదాపు మూడు గ్రామాల పరిధిలోనూ 850 మంది వరకు లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వడానికి ఆటంకం కలిగింది. ఆ స్థలాన్ని చదును చేసిన కాంట్రాక్టర్ తప్పిదం కారణంగా వేమగిరి, కడియపుసావరం, కడియం గ్రామాల పరిధిలో లబ్ధిదారులకు ఇప్పటి వరకూ ప్లాట్లు ఇవ్వలేదు.



వేమగిరి జిల్లా పరిషత్ స్థలంలో జరుగుతున్న పనులు

**చందన నాగేశ్వర్ చొరవ**

తమతో పాటే స్థలాలు పొందిన తోటివారు ఇళ్లు నిర్మించుకుంటున్నారని, తమకు పట్టాలు మాత్రమే ఇచ్చారని, ప్లాట్లు కేటాయించలేదని వేమగిరి జిల్లా పరిషత్ స్థలం లేఅవుట్‌లోని పై మూడు గ్రామాల లబ్ధిదారులు ఆవేదనకు గురయ్యారు. ఆయా గ్రామాలకు చెందిన నాయకులు కూడా ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకువెళ్లారు. క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందిని పరిష్కరించేందుకు చందన తీవ్రంగా కృషి చేశారు.

**శరవేగంగా..**

కలెక్టర్ మాధవీలతను కలిసి లబ్ధిదారుల ఇబ్బందులను చందన నాగేశ్వర్ వివరించారు. పలుమార్లు లేఅవుట్‌ను సందర్శించిన కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు కూడా ఇక్కడి సమస్య అవగతమైంది. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. దీంతో లేఅవుట్‌ను చదును చేసి లబ్ధిదారులందరికీ ప్లాట్లు కేటాయించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు అందాయి. దీంతో చదును చేసే ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. వారం రోజుల్లో ప్లాట్లుగా విడదీసి, సరిహద్దు రాళ్లు వేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే తహసీల్దార్ ఎం.సుజాత పర్యవేక్షణలో సర్వేరాళ్లను రప్పిస్తున్నారు. వేగంగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు దసరా కానుకగా స్థలాలను ఇవ్వాలని పనులు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

> **వారం రోజుల్లో ప్లాట్లు**
>
> 
>
> కడియం మండలం పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల కేటాయింపు వారం రోజుల్లో పూర్తి కానుంది. వేమగిరి, కడియపుసావరం, కడియం గ్రామాల పరిధిలో సుమారు 850 మంది లబ్ధిదారులకు వీటిని కేటాయిస్తారు. దసరా కానుకగా స్థలాలను ఇవ్వనున్నారు. దీంతో మొదటి విడత ఇళ్ల స్థలాల కేటాయింపు వందశాతం పూర్తవుతుంది.
>
> – చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్

## జిల్లాలో 8,414 మందికి వైద్యసేవలు

**రాజమహేంద్రవరం రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మూడవరోజు బుధవారం జిల్లా వ్యాప్తంగా 16 ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. పాలమూరు 1, బిక్కవోలు 1, దేవరపల్లి 3, మురమండ 1, కోరుకొండ 2, చిడిపి, అనంతపల్లి 2, పురుషోత్తపల్లి, మల్లేశ్వరం, కాతేరు 2, సుభద్రమ్మపేట, చినకొండేపూడి, అన్నదేవరపేట1, వడ్లూరు పీహెచ్‌సీల్లోనూ, క్రిస్టియన్ పేట (కొవ్వూరు), నెహ్రూ నగర్ (నిడదవోలు) యూపీహెచ్‌సీల్లో జరిగిన వైద్యశిబిరాల్లో సాయంత్రం 6 గంటల వరకూ 8,414 మంది రోగులు వైద్య సేవలు పొందారు. వీరిలో 295 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేసినట్టు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తదితరులు తెలిపారు.

## ఓటమి భయంతోనే అరెస్టులు

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎన్నికల్లో ఎదుర్కొనే సత్తా లేకే అక్రమ కేసులు, అరెస్టులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిగారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆయన ఆధ్వర్యంలో గౌతమీ ఘాట్ వద్ద గోదావరిలో రూరల్ నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం జలదీక్ష చేశారు.

## యువకుడి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోండి



వెంకట్ ఆరోగ్య పరిస్థితిపై తండ్రిని వివరాలు అడుగుతున్న ఎంపీ భరత్ రామ్

- వైద్యులతో మాట్లాడిన ఎంపీ భరత్ రామ్
- బాధితుడి తండ్రికి భరోసా

**రాజమహేంద్రవరం రూరల్:** గామన్ బ్రిడ్జిపై ఈ నెల ఒకటో తేదీన బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన వెంకట్ ఆరోగ్య పరిస్థితిపై రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆరా తీశారు. అతడి తండ్రి నిడదవోలు రమణ బుధవారం ఎంపీ కార్యాలయంలో భరత్‌రామ్‌ను కలిశాడు. బొల్లినేని ఆసుపత్రిలో తన కుమారుడు చికిత్స పొందుతున్నాడని, బుధవారం వెంటిలేటర్ తొలగించారని, మెల్లిగా కోలుకుంటున్నాడని తెలిపాడు. ఆసుపత్రిలో ఫీజు అడుగుతున్నారని ఎంపీ దృష్టికి తీసుకు రాగా.. ఆ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. బాధితుడికి చేస్తున్న వైద్యానికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందో లేదో చూడాలని వైద్యులను కోరారు. అలాగే ప్రమాదానికి కారణమైన పంగిడికి చెందిన లారీ యజమానిని అదుపులోకి తీసుకున్నారా లేదా అని పోలీసులకు ఫోన్ చేసి అడిగారు. కాగా.. కోనసీమ జిల్లా మండపేట సమీపంలోని ఆర్తమూరు గ్రామానికి చెందిన నిడదవోలు రమణ, వీరలక్ష్మి, వెంకట్ బైక్‌పై వెళుతుండగా లారీ ఢీకొంది. ఘటనా స్థలంలోనే వీరలక్ష్మి మృతి చెందగా, కుమారుడు వెంకట్‌కు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆ సమయంలో రాజమహేంద్రవరం నుంచి నల్లజర్ల వెళుతున్న ఎంపీ భరత్ తక్షణ చర్యలు తీసుకున్నారు. గాయపడిన వెంకట్‌ను అంబులెన్స్‌లో తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బొల్లినేని ఆసుపత్రికి తరలించారు.

## జగనన్న సురక్ష శిబిరంలో వైద్యసేవలు

**రాజమహేంద్రవరం రూరల్:** కాతేరు గ్రామసచివాలయం–2 పరిధిలోని విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 514 మందికి వైద్య సేవలు అందించారు. 21 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ కె.రత్నసాగర్, సచివాలయ కన్వీనర్లు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు వెంకటేష్, వైష్ణవితో పాటు పీహెచ్‌సీ వైద్యులు లిడియా సుచిత్ర, కె.నాగదేవి, చైతన్య కృష్ణ వైద్యసేవలు అందించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై సూపర్‌వైజర్ మేరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాతేరు సొసైటీ చైర్మన్ ఆచంట కల్యాణ్, సచివాలయ కన్వీనర్లు కొత్తపల్లి నాగేశ్వరరావు, ఆచంట రవీంద్ర, పార్టీ నాయకులు యెజ్జు వాసు, మానుకొండ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



కాతేరులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్

**కడియం:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ముంగిటకే విస్తృత వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీడీవో కె.రత్నకుమారి అన్నారు. మురమండ సచివాలయం 1 పరిధిలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 500 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. 90 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, 55 మందికి కళ్లజోళ్లు అందజేశారు. సాధారణ, గుండె, దంత వైద్య పరీక్షలను డాక్టర్ జెస్సీ సుప్రియ ఆధ్వర్యంలో బృందం నిర్వహించింది. ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ అయిన విల్లి రుక్మిణీ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మెల్లిమి మంగగంగరాజు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎంఈవో వి.లజపతిరాయ్, పంచాయతీ కార్యదర్శులు శిరీష, విజయరాజు పాల్గొన్నారు. రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తన చందన చేయూత ట్రస్టు ద్వారా వైద్య పరీక్షలకు విచ్చేసిన గ్రామస్తులకు భోజన సదుపాయం కల్పించారు.



మురమండలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో రత్నకుమారి

## క్లుప్తంగా

### మనో విజ్ఞాన సదస్సు

**కంబాలచెరువు:** రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్లో బుధవారం మనోవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఐకాన్స్ అధ్యక్షుడు తీగెల రాజా మాట్లాడుతూ చిన్న పిల్లలు చదువు మీద కాకుండా పలు విషయాలపై దృష్టి పెడుతున్నారన్నారు. వారిలోని ఆ సమస్యకు మనో విజ్ఞాన సదస్సు ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి, తిరిగి ఉత్సాహంతులుగా తయారు చేస్తామన్నారు. రొటీరియన్ కత్రి రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో వారానికి ఒక రోజు నిర్వహిస్తామన్నారు. రోటరీ క్లబ్ జాయింట్ సెక్రెటరీ కె.జాన్, ఉదయగిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదన



డ్రైనేజీలను పరిశీలిస్తున్న సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం సిటీ:** అవసరమైన చోట్ల డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఆయన బుధవారం స్థానిక 6వ డివిజన్‌లో పర్యటించారు. అక్కడి డ్రైనేజీల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో మౌలిక సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వెంట బురుడి త్రిమూర్తులు, పాలూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### చందన నాగేశ్వర్ పరామర్శ

**రాజమహేంద్రవరం రూరల్:** కొంతమూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పఠాన్ నాగూర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను బుధవారం వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ షేక్ మౌలాలి, చెరుకూరి సత్తిబాబు, ఎంఎం ఆలీ, పటాన్ పింటూ, ముస్తఫా, షేక్ నన్ను ఉన్నారు.

### జంతు సంక్షేమ దినోత్సవం

**కంబాలచెరువు:** స్థానిక ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ప్రపంచ జంతు సంక్షమ దినోత్సవం నిర్వహించారు. రంపచోడవరం డివిజన్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్‌కే అజాద్ మాట్లాడుతూ విద్యార్థులకు జంతు సంరక్షణపై అవగాహన కల్పించారు. వివిధ రకాల వన్య ప్రాణులు, జంతువులు, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు, జంతుశాస్త్ర విభాగాధిపతి కె.దుర్గారావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఎ.శ్రీనివాసరావు, రసాయనశాస్త్ర విభాగాధిపతి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### రేపు విద్యుత్ అంతరాయం

**కడియం:** కడియపులంక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక, వెంకాయమ్మపేట, దోసాలమ్మ కాలనీలకు సరఫరా ఉండదన్నారు.

**రాజమహేంద్రవరం సిటీ:** హుకుంపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ బుధవారం తెలిపారు. హుకుంపేట, ఆదర్శ్ నగర్, రామకృష్ణ నగర్, వెంకటగిరి ఫీడర్స్‌కు సరఫరా ఉండదన్నారు. వాటి పరిధిలోని సావిత్రీ నగర్, హుకుంపేట, వరలక్ష్మీ కాలనీ, జన చైతన్య నగర్, కార్తికేయ నగర్, డీఎస్ఆర్ నగర్, రామకృష్ణ నగర్, ఆదర్శ్ నగర్, బాలాజీ పేట, వెంకటగిరి 2, బాపూజీ నగర్, గంగిరెడ్ల కాలనీ, హుకుంపేట గ్రామంలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

### నేడు మండల పరిషత్ సమావేశం

**కడియం:** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

### విశ్వకర్మలు ఆర్థికంగా ఎదగాలి

**సీటీఆర్ఐ:** విశ్వకర్మలు ఆర్థికంగా ఎదగాలనే గొప్ప ఆశయంతో ప్రధానమంత్రి మోదీ విశ్వకర్మ యోజన పథకాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించారని విశ్వకర్మ వడ్రంగి పనివారల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవగుప్తాపు శ్రీనివాస్ అన్నారు. స్థానిక సీటీఆర్ఐ జంక్షన్ వద్ద గల సంఘ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించి తీర్మానాలు ప్రతిపాదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మలను గుర్తించిన ఏకైక ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నామన్నారు. ఇంతటి గొప్ప పథకాన్ని అన్ని ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీరబాబు, ప్రసాదు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎన్‌సీసీ అర్హత పరీక్షలు

**కంబాలచెరువు:** స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు బుధవారం అర్హత పరీక్షలు నిర్వహించారు. వీటికి 62 మంది బాలురు, 42 మంది బాలికలు ఎంపికయ్యారు. వీరికి పరుగుతో పాటు వివిధ పోటీలను నిర్వహించి ఎంపిక చేశారు. ఎన్‌సీసీ బెటాలియన్‌కు చెందిన సుబేదార్ భాస్కరరెడ్డి, హవల్దార్ జగదీష్‌సింగ్ పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ ప్రవేశంతో ఆర్మీ శిక్షణలో సీ, బీ ధృవపత్రం సాధించవచ్చని, దీని వల్ల ఉన్నత విద్యలో రిజర్వేషన్, ఆర్మీ, పోలీసు ఉద్యోగాలలో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. ఈ పోటీల్లో 520 మంది పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ ఈసూబ్‌బాషా, కేర్‌టేకర్ అనూష, తదితరులు పాల్గొన్నారు.



అర్హత పరీక్షలకు హాజరైన విద్యార్థులు

## కూచిపూడి నర్తకి మధులతకు గౌరవ డాక్టరేట్

**సీటీఆర్ఐ:** కూచిపూడి నర్తకి రాచపల్లి మధులతకు గౌరవ డాక్టరేట్ అందించడం ఆనందంగా ఉందని స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఫౌండర్, చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ అన్నారు. తెలంగాణ సారస్వతి పరిషత్, ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రిసెర్చ్ యూనివర్సిటీ (యూఎస్‌ఏ), స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా సంయక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ హనరీ అవార్డ్స్ సెర్మనీ డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన మధులత తన 15 ఏళ్ల అనుభవాన్ని మేళవించి కూచిపూడి నృత్యంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాటలకు నృత్యాభినయం చేశారు. నాలుగో ఏట నుంచే నృత్యాన్ని అభ్యసించిన మధులత అనేక పురస్కారాలను పొందారు. ఆమెకు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రిసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందించింది.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న మధులత

## ప్రతి ఇంట్లో సంక్షేమ వెలుగులు

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..

**రాజమహేంద్రవర సిటీ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరబూస్తున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. 40వ డివిజన్‌లోని రమా సత్యనారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్‌పర్సన్, డివిజన్ ఇన్‌చార్జి దుంగ మంగాదేవి ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మైనింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మార్తి లక్ష్మి, బత్తిన అన్నవరం, ఎలమంచిలి నాగరాజు, దమ్ము అప్పాజీ పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

### ఇంటర్ విద్యార్థి అదృశ్యం

**రాజమహేంద్రవరం రూరల్:** కళాశాలకు వెళ్లిన తన కుమారుడు ఇంటికి తిరిగి రాలేదని చాగల్లు గ్రామానికి చెందిన పోతురాజు నాగేశ్వరరావు బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చాగల్లుకు చెందిన 17 ఏళ్ల సత్యనారాయణ స్థానిక షెల్టాన్ హోటల్ సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్ చదువుతున్నాడు. ప్రతి రోజూ ఇంటి నుంచి కళాశాల బస్సులో వస్తాడు. మంగళవారం ఇంటి నుంచి కళాశాలకు వచ్చిన సత్యనారాయణ సాయంత్రం 5.40 బయటకు వచ్చినప్పటికీ ఇంటికి రాలేదు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బీసీ మహాసభను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న ఎంపీ సుభాష్ చంద్రబోస్, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

**రాజమహేంద్రవరం రూరల్:** నియోజకవర్గంలో ఈ నెల నాలుగో వారంలో చేపట్టబోయే బీసీ మహాసభను విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. హుకుంపేటలోని గోల్డెన్ సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాల్లో పిడింగొయ్యి గ్రామ బీసీ సంఘీయుల ఆత్మీయ సమావేశం బుధవారం రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సభలో పిల్లి సుభాష్‌చంద్రబోస్, కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. బోస్ మాట్లాడుతూ బీసీ మహాసభ విజయవంతానికి గ్రామాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. బీసీలంతా రాబోయే ఎన్నికలలో జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జగనన్నకు సంపూర్ణ మద్దతు, ఆశీస్సులు అందజేసి రాబోయే ఎన్నికలలో మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

## 'జగన్ ఎందుకు కావాలంటే' విజయవంతం చేద్దాం

- రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ధవళేశ్వరంలో సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న చందన నాగేశ్వర్

**ధవళేశ్వరం:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరిస్తూ ఈ నెల 11 నుంచి నెల రోజుల పాటు జరగనున్న 'జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పిలుపునిచ్చారు. ధవళేశ్వరంలోని శ్రీమతి జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో ధవళేశ్వరం, బొమ్మూరు, రాజవోలు సచివాయాల కన్వీనర్లు, గృహసారథులలో బుధవారం సమావేశం నిర్వహించారు. నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రతి గృహసారథి తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి జగన్ ముఖ్యమంత్రి అయ్యాక చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను ఏ విధంగా వంచించారో ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. సచివాలయాల్లో ఒక రోజు బస చేసి అక్కడ నెలకొన్న పరిస్థితులపై చర్చించాలన్నారు. ప్రజలను కలిసినప్పుడు వారి నుంచి ఐదు ప్రశ్నలకు జవాబులను తీసుకోవాలన్నారు. సచివాలయాల వద్ద పార్టీ జెండా ఎగుర వేసే విధంగా స్తూపాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రొప్పాలిక శ్రీను, జేసీఎస్ కన్వీనర్లు తడాల చక్రవర్తి, తాటికొండ విష్ణుమూర్తి, క్లస్టర్ ఇన్‌చార్జి పెయ్యల రాజేష్, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షబ్బర్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వర ప్రసాద్, పెన్నాడ జయప్రసాద్, గరగ శ్రీను, హమీద్ బాషా, బొడ్డేటి శివాజీ, చాటకాల చంటి, పెన్నాడ లక్ష్మి, మెండా రాజేష్, గొన్నా సత్తిబాబు పాల్గొన్నారు.

### మజ్దూర్ యూనియన్ అభ్యర్థులను గెలిపించండి

**రాజమహేంద్రవరం సిటీ:** ఈ నెల 12వ తేదీన జరగనున్న రైల్వే కోఆపరేటివ్ బ్యాంకు ఎన్నికలలో సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ తరఫున పోటీ చేస్తున్న 29 మంది అభ్యర్థుల ప్యానల్‌ను గెలిపించాలని రైల్వే ఉద్యోగులకు యూనియన్ డివిజనల్ సెక్రటరీ ఎం.లీల విజ్ఞప్తి చేశారు. ఆమె బుధవారం రాజమహేంద్రవరం వచ్చారు. స్టేషన్ పరిధిలోని రైల్వే ఉద్యోగులతో మాట్లాడారు. మజ్దూర్ యూనియన్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో విజయవాడ డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ రామ్ గుప్తా, ట్రెజరర్ ఆర్ఎం లక్ష్మి, రాజమహేంద్రవరం నాయకులు కె.విజయకుమార్, డి.శ్రీనివాసరెడ్డి, కె.తిరుమల దేవ్ పాల్గొన్నారు.

### జిల్లాలో 75.20 శాతం ఆరోగ్య డేటా సేకరణ

**రాజమహేంద్రవరం రూరల్:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 356 గ్రామ వార్డు సచివాలయాల్లో 4,46,233 ఇళ్లకు గాను 3,35,614 ఇళ్లను సందర్శించి 75.20 శాతం ఆరోగ్య డేటా సేకరించినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షపై సీఎం కార్యాలయ ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టర్ విడిది కార్యాలయం నుంచి కలెక్టర్ మాధవీలత, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.సనత్ కుమారి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూరుశాతం ఇంటింటి సందర్శన పూర్తిచేయనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా, మండల స్థాయి అధికారులతో జేఏఎస్ ప్రగతి, టోకెన్ జారీ, తదుపరి చికిత్స కోసం చేపడుతున్న చర్యలపై దిశానిర్దేశం చేశారు.

### నిరుద్యోగ సదస్సు

**రాజమహేంద్రవరం సిటీ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేశాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రివర్‌బేలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నిరుద్యోగ సదస్సు నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు, యువతలో నైపుణ్య అభివృద్ధి, ప్రభుత్వ శాఖలలో ఖాళీ పోస్టుల భర్తీలతో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న 19 తీర్మానాలను ప్రవేశ పెట్టగా సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.